సాక్షి
తిరుపతి
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



పేదలపై ఎందుకంత కక్ష

క్రిస్ సిటీ కోసం లాక్కున్న భూములకు పరిహారం ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. - 10లో



మ్యాగజైన్ ఆవిష్కరణ

ఇంక్ అండ్ ఇమాజినేషన్ మ్యాగజైన్‌ను ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్ గురువారం ఆవిష్కరించారు. - 10లో



అమ్మా..ఊపిరాడలేదు!

కారులో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను పోలీసులు సురక్షితంగా బయటకు తీసిన ఘటన తిరుమలలో చోటుచేసుకుంది. - 10లో

నిర్బంధం నిగ్గుతేలని నిజం

గోశాలకు వెళ్లకుండా భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఇతర నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్) ఎంపీ గురుమూర్తితో కూటమి నేతల వాగ్వాదం





కూటమి నేతలు కపట నాటకాలకు తెరదీశారు. జరిగిన తప్పుని సరిదిద్దాల్సింది పోయి బుకాయింపులకు దిగారు. టీటీడీ గోశాలలో గోవుల మృత్యుఘోషను ప్రపంచానికి వినిపించకుండా.. కళేబరాలు కనిపించకుండా చేయాలని విశ్వప్రయత్నాలు చేశారు. చివరకు సవాల్ విసిరి నిజాలు నిగుతేలుతాయని భయపడిపోయారు. పోలీసులను రంగంలోకి దింపి ఎక్కడికక్కడ అడ్డుకుంటూ చెలరేగిపోయారు. వీరి నాటకాలు చూసిన జనాలు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకున్నారు. గోసంరక్షణను గాలికొదిలేసి ఇలా బరితెగించడం ఎంతవరకు కరెక్ట్ అని ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన గురువారం తిరుపతిలో చర్చనీయాంశంగా మారింది.

టీటీడీ గోశాల ఘటనపై హైడ్రామా

- సవాల్ విసిరి స్వీకరించకుండా అడ్డగింపులు
- వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లకుండా పోలీసుల నిర్బంధం
- నిజాలు నిగ్గుతేలకుండా ఇదేం పని అంటున్న స్థానికులు



రోడ్డుపై పడుకొని నిరసన తెలుపుతున్న భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి నారాయణస్వామి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాజేష్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: టీటీడీ గోశాలలో గోవుల మృతిపై లెక్కతేలకుండా కూటమి నేతలు అడ్డుకట్టకు యత్నించారు. తప్పులు కప్పిపుచ్చేందుకు అధికార మదంతో రెచ్చిపోయారు. కుట్రపూరితంగా సవాల్ విసిరి రెచ్చగొట్టారు. ఆపై పోలీసులను రంగంలోకి దింపి వైఎస్సార్‌సీపీ నాయకులు గోశాలకు వెళ్లకుండా నిర్బంధకాండకు పూనుకున్నారు. ఈ ఘటన గురువారం తిరుపతిలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.

తప్పుడు ప్రకటనలు..కప్పిపుచ్చే యత్నాలు

టీటీడీ గోశాలలో వరుసగా గోవులు మృత్యువాత పడుతున్నాయంటూ ఇటీవల వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి సంచలన విషయాలు తెరపైకి తెచ్చారు. నాటి నుంచి కూటమి నేతలు ఆ తప్పుని కప్పిపుచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. మొదట తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ పరస్పర విరుద్ధ ప్రకటనలకు దిగారు. 40 గోవులు మృతి చెందాయని ఒకరంటే.. కాదుకాదు 20 నుంచి 22 గోవులు మాత్రమే మృతి చెందాయని ఇంకొకరు చెప్పుకొచ్చారు. మరో వైపు టీటీడీ ఏకంగా ఈఓ మీడియా సమక్షంలోనే గత మూడు నెలల కాలంలో 43 గోవులు మృతి చెందాయని కుండబద్దలు కొట్టేశారు. మొదటి రోజు గోవులు చనిపోలేదని ప్రకటన చేసి.. మరుసటి రోజు గోవులు మరణించాయని ప్రకటన చేయడాన్ని కూటమి శ్రేణులే తీవ్రంగా తప్పుపడుతున్నారు.

సవాల్ విసిరి..నిజాలు దాచి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా రెచ్చిపోయారు. టీటీడీ గోశాలలో గోవులు మృతిచెంది ఉంటే నిరూపించాలంటూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సవాల్ విసిరారు. దీనిపై భూమన కరుణాకరరెడ్డి స్పందించారు. గురువారం ఉదయం 10గంటలకు టీటీడీ గోశాలకు వస్తాను అని ప్రకటన చేయగా.. పల్లా రమ్మని ఆహ్వానించారు. తీరా పల్లా శ్రీనివాసరావు రాకపోగా.. కూటమి నేతలను గుంపుగా గోశాలకి పంపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గోశాలకు వెళ్లకుండా అడ్డుకట్టకు తెరలేపారు. బుధవారం అర్ధరాత్రి నుంచి కూటమి నేతలు ఆడిన నాటకాలు చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు.



గోశాలకు వెళ్లకుండా పోలీసుల అడ్డగింపు

ఇదేనా సనాతన ధర్మం

తామే సనాతన ధర్మానికి ప్రతినిధులమని, హిందువులు, గోమాతలంటే భక్తి అని చెప్పుకునే కూటమి నేతలు.. టీటీడీ గోశాలలో ఉన్న పవిత్రమైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో చెప్పులు ధరించి తిరిగారు. ఆలయం అరుగుపై చెప్పులతోనే నిల్చొని ఫొటోలకు ఫోజులిచ్చారు. దీనిపై కూటమి శ్రేణులే ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



టీటీడీ గోశాలలో టీడీపీ జెండాలతో ఉన్న కార్లు

నిజాలు నిగ్గుతేల్చేందుకు సిద్ధం

తిరుపతి మంగళం : టీటీడీ గోశాలలో గోవుల మృతిపై టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌రావు విసిరిన సవాల్‌ను తమ పార్టీ జిల్లా అధ్యక్షులు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్వీకరించి గోశాలకు వస్తామంటే పోలీసులచేత అడ్డుకోవడం ఏంటని మాజీ మంత్రులు ధ్వజమెత్తారు. తిరుపతి పద్మావతీపురంలో పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం గోశాలకు వెళ్లేందుకు బయలుదేరిన భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోట రాజేష్‌ను పోలీసులచేత ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు.



నిరసన తెలుపుతున్న నేతలతో పోలీసుల వాగ్వాదం



ఎంపీ గురుమూర్తిని గోశాల నుంచి బయటకు పంపేస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ

దమ్ముంటే గోశాలకు అనుమతించాలి

టీడీపీ అధ్యక్షుడు ఎక్కడో కూర్చొని సవాల్ విసరడం కాదని, దమ్ముంటే సవాల్‌ను స్వీకరించిన భూమన కరుణాకరరెడ్డిని గోశాలకు పిలిపించుకుని నిజాలు నిగ్గుతేల్చాలి. టీటీడీ నిర్లక్ష్యం లేకుంటే మమ్మల్ని ఎందుకు గోశాలకు రానివ్వలేదు. చంద్రబాబుకు అబద్ధాలు చెప్పడం వెన్నతో పెట్టిన విద్య. సనాతన ధర్మ పరిరక్షకుడైన పవన్‌కళ్యాణ్ కూడా టీటీడీలో జరుగుతున్న అపచారాలను ఎందుకు ప్రశ్నించడం లేదు. తప్పులను సరిదిద్దుకోకుండా తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు జగనన్నపై ఎదురుదాడులకు దిగడం సిగ్గుచేటు.

– ఆర్కే.రోజా, మాజీ మంత్రి

స్వామితోనే రాజకీయమా బాబు?

సాక్ష్యాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామితో చంద్రబాబు చేసిన రాజకీయం కారణంగానే తిరుమలలో ఇన్ని అపచారాలు జరగుతున్నాయి. శ్రీవారి లడ్డూలో ఆవు, పంది కొవ్వు కలిసిందని ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు చంద్రబాబుకు మొట్టిక్కాయలు వేసింది. అయినప్పటికీ చంద్రబాబుకు బుద్ధి రాలేదు. ఇప్పుడు గోశాలలో గోవులు మృతి చెందితే ఒక్క ఆవు కూడా చనిపోలేదని అబద్ధాలు చెబు తున్నారు.

– కే.నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

వందకుపైగా గోవులు మృతి

గత పది నెలలుగా టీటీడీ గోశాలలో వందకు పైగా గోవులు మృతి చెందాయి. దీనిపై టీడీపీ అధ్యక్షుడు సవాల్ విసిరి నిజాలు నిగ్గు తేల్చకుండా అడ్డుకోవడం దారుణం. ఆయన సవాల్‌ను తమ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి స్వీకరించి గోశాలకు బయలు దేరితే పోలీసులచేత అడ్డుకోవడం ఏంటి?. సవాల్‌ను ఎదుర్కొనే దమ్ములేదా?. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. తప్పిదాలను సరిదిద్దుకునే పరిస్థితి కనిపించడం లేదు.

– భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త

హిందువుల మనోభావాలతో ఆటలా?

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం, టీటీడీ వ్యవహరిస్తోంది. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మరిన్ని తప్పులు చేస్తున్నారు తప్ప వాటిని సరిదిద్దుకోవడంలేదు. గోశాలలో గోవుల మృతిపై సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ చైర్మన్, ఈవో, స్థానిక ఎమ్మెల్యేలు వారికి తోచినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. రాజకీయాలు మానుకుని గోశాలలో గోవుల మృతిపై నిజాలు అందరికీ తెలియజేయాలి.

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త



మాజీ మంత్రి రోజాను అడ్డుకుంటున్న పోలీసులు



అభినయ్‌ని గోశాల నుంచి బయటకు పంపుతున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు



ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌లో భూమన అభినయ్, నేతలు

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 70,372 మంది స్వామివారిని దర్శించుకోగా 24,463 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎస్వీయూ మీడియా డీన్‌గా వెంకటేశ్వర్లు



తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా డీన్‌గా ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వర్సిటీ మీడియా డీన్‌గా గురువారం నుంచి ఆయన కొనసాగనున్నారు.

శ్రీవారికి నాణ్యమైన సేవలు



సమీక్షిస్తున్న ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్, సభ్యులు

తిరుపతి కల్చరల్: శ్రీవారి భక్తుల సేవ నిరంతరం అని, మరింత నాణ్యమైన సేవలు అందిస్తూ శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఏపీ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుల్ల జోగేశ్వరరావు సూచించారు. పద్మావతి అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్, సభ్యులు, టీటీడీ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ అంచనాల కమిటీ చేసిన పలు సూచలను పరిగణనలోకి తీసుకుని మరింత నాణ్యంగా సేవలు అందించాలన్నారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సభ్యులు సూచించారు. స్వామివారి కీర్తనలు, గోవిందనామావళిని రాత్రి 10 గంటల వరకు వినిపించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. టీటీడీ ఈఓ శ్యామలరావు సమాధానం ఇస్తూ ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తిరుమలలో అందిస్తున్న సేవలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, ఏపీ అంచనాల కమిటీ సభ్యులకు వివరించారు. ఏపీ అంచనాల కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ వాల్మీకి పార్థసారథి, పాశిం సునీల్‌కుమార్, ఏలూరు సాంబశివరావు, వరుద కల్యాణి, టీటీడీ జేఈఓ వీ.వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఏకీకృత సీనియారిటీ జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్‌అసిస్టెంట్ల ఏకీకృత సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం కేడర్ ఉద్యోగోన్నతికి మెరిట్ ప్రకారం సిద్ధం చేసిన ఏకీకృత సీనియారిటీ జాబితాను ఈ నెల 17వ తేదీన విడుదల చేశామన్నారు. ఈ జాబితాను స్కూల్ అసిస్టెంట్లు సరి చూసుకోవాలన్నారు. ఏవైనా అభ్యంతరాలున్నట్లైతే తగు ఆధారాలతో ఈ నెల 20 వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు తేదీ తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబడవని డీఈఓ వెల్లడించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్: మౌలిక వసతుల ప్రాధాన్యతకు.. అభివృద్ధికి సంబంధించిన అంశాలకు మొదటి స్థానం ఉంటుందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో 16వ ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులతోపాటు అధికారులతో కలసి సమీక్షించారు. సంఘం చైర్మన్ మాట్లాడుతూ కొన్ని ముఖ్యమైన అంశాలకు కేంద్రం నుంచి నిధుల విడుదలకు ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి చేపట్టాల్సిన అంశాలను తెలియజేశారు. దీంతో స్పందించిన ఆయన ప్రాధాన్యత అంశాలకు మొదటి స్థానం ఉంటుందని చెప్పారు.

వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పరిశీలన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ (చెత్త నుంచి సంపద కేంద్రం)ను గురువారం 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు రితివ్క్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితరులు పరిశీలించారు. సదరు ప్లాంట్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ, కంపోస్టు, బయో మెథనైజేషన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ నగరంలో రోజూ సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా మారుస్తారని, ఇలా ఉత్పత్తయిన ఇసుక, గుల్లతో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేస్తున్నట్టు తెలిపారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, జే.నివాస్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక కమిషన్ బృంద సభ్యులకు వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

జోరు..హు'షారు'!

– షార్‌లో ఒకేసారి నాలుగు రాకెట్ల అనుసంధానం



సూళ్లూరుపేట: ఆకాశమే హద్దుగా వరుస విజయాలతో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దూసుకుపోతోంది. తాజాగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో గత కొద్ది రోజుల నుంచి ఒకేసారి నాలుగు రాకెట్ల అనుసంధానం పనులను ప్రారంభించింది. ఇస్రో అంతరిక్ష ప్రయోగాల ప్రయాణంలో ఇదో మైలురాయిగా నిలుస్తోంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ భవనం (పీఫ్)లో పీఎస్ఎల్‌వీ సీ–61 రాకెట్ అనుసంధానం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రాకెట్ ద్వారా ఈఓఎస్–09 అనే ఉపగ్రహంతోపాటు వాణిజ్యపరంగా మరో రెండు ఉపగ్రహాలను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో జీఎస్ఎల్‌వీ ఎఫ్–16 రాకెట్ అనుసంధానం పనులు చేపట్టారు. సాలిడ్‌స్టేజ్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (ఎస్ఎస్ఏబీ)లో ఎల్‌వీఎం3–ఎం5 రాకెట్ అనుసంధానం పనులు జరగుతున్నాయి. రెండవ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో గగన్‌యాన్–1 ప్రయోగానికి సంబంధించి ఎల్‌వీఎం3–జీ1 అనే రాకెట్ అనుసంధానం పనులు కూడా చేస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి జిల్లా వ్యాప్తంగా 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.సయ్యద్‌సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 8 నుంచి 14ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అనువుగా శాప్ ఆదేశాల మేరకు మే 1 నుంచి 31వ తేదీ వరకు శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలోని క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు ముందుకొచ్చి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

మ్యాగ్‌జైన్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ సైన్స్ కళాశాల సిద్ధం చేసిన 'ఇంక్ అండ్ ఇమాజినేషన్ మ్యాగ్‌జైన్'ను వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం వీసీ చాంబర్‌లో ఆవిష్కరించారు. 2023–24 విద్యాసంవత్సరంలో సైన్స్ కళాశాలలో జరిగిన పూర్తి సమాచారం మ్యాగ్‌జైన్‌లో పొందుపరచినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు

23 నుంచి పీజీ ఆర్ట్స్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలల్లో ఈనెల 23 నుంచి పీజీ ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వర్సిటీ అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను అన్ని పీజీ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సమాచారం అందించారు. ఈనెల 29 వరకు కొనసాగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పకడ్బందీగా నిర్వహించాలని వర్సిటీ అధికారులు ఆదేశించారు. కాగా ఇప్పటికే పీజీ సైన్స్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు ఈనెల 15 నుంచి జరుగుతున్నాయి.

అదృశ్యమైన బాలుడు లభ్యం

తిరుమల: తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ధర్మగిరి నుంచి అదృశ్యమైన బాలుడు లభ్యమైనట్లు టూ టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. వారి తెలిపిన వివరాల మేరకు.. ధర్మగిరిలోని విద్యార్థి సంస్కృత తివారి(15) రాయపూర్ చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి. బుధవారం సాయంత్రం ధర్మగిరి నుంచి ఎవరికీ చెప్పకుండా పారిపోయాడు. కాలేజీ ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. విద్యార్థి సంస్కృతి తివారి సొంత ఊరైన చతిస్‌ఘడ్ రాష్ట్రం, రాయపూర్‌కి వెళ్లినట్లుగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. వెంటనే తల్లిదండ్రులను ఆరాతీయగా బాలుడు వచ్చినట్టు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రవేశాల సంగతేంటి గోవిందా?





ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల

టీటీడీ విద్యాసంస్థల్లో డిగ్రీ అడ్మిషన్ల మాటేమిటో?

- గత ఏడాదిలా ఈ సారీ నిరీక్షణేనా?
- ఆలస్యమయ్యే కొద్దీ తగ్గుతున్న ప్రవేశాలు
- ఇంటర్ ఫలితాలు విడుదలైనా అడ్మిషన్లపై ఊసెత్తని అధికారులు
- నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న 30 వేల మంది విద్యార్థులు

తిరుపతి సిటీ: టీటీడీ డిగ్రీ కళాలల్లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల ఆలస్యమవుతోంది. గత ఏడాది జూలైలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టు చివరి వరకు కొనసాగించారు. అప్పటికే విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. దీంతో టీటీడీ కళాశాలల్లో అడ్మిషన్లు 60 శాతానికి మించలేదు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు విడుదల చేసి పది రోజులు గడుస్తున్నా ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి అధికారులు ఊసెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎదురుచూపులే!

శ్రీపద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఎదురు చూ స్తున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల విద్యార్థులు టీటీడీ డిగ్రీ కళాశాలల్లో వే ల సంఖ్యలో అడ్మిషన్లు పొందుతున్నారు. ప్రతి ఏడాదీ అన్ని కళాశాలలకు కలిపి మొత్తం 25 వేలకు పైగా ద రఖాస్తులు అందుతున్నాయి. ఈ ఏడాది 30 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నోటిఫికేషన్ త్వరగా విడుదల చేస్తే కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.



ఎస్వీ ఆర్ట్స్ కళాశాల భవనం

మేజర్ సబ్జెక్టుల విధానంపై స్పష్టత కరువు

డిగ్రీ కోర్సుల్లో మేజర్ సబ్జెక్టుల విధానంపై ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నూతన విద్యా విధానం అమలులో భాగంగా డిగ్రీ కోర్సులలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధి విధానాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కమిటీ స మావేశం ముగిసి పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం వెలువడలేదు. దీంతో అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆలస్యమయే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాదిలాగా ఇంజనీరింగ్ అడ్మిషన్లతో ముడిపెట్టకుండా డిగ్రీ కోర్సులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

టీటీడీ కళాశాలలో పలు కోర్సులలోని సీట్ల వివరాలు			
కళాశాల	విభాగాలు	సీట్ల వివరాలు	హాస్టల్ సౌకర్యం
పద్మావతి డిగ్రీ కళాశాల	22	1,550	700
ఎస్వీ ఆర్ట్స్ కళాశాల	21	1,470	450
ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల	19	1,068	395
ఓరియంటల్ కళాశాల	7	600	250

అటానమస్ హోదాలో రెండో ఏడాది

పద్మావతి డిగ్రీ కళాశాల, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలు అటానమస్ హోదా పొందిన తర్వాత రెండో ఏడాది అడ్మిషన్లకు సమాయత్తం కావాల్సి ఉంది. గత ఏడాది ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్(ఓఏఎంబీసీ) అనే వెబ్ పోర్టల్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ ఏడాది ఆయా కళాశాలలకు అడ్మిషన్ల నిర్వహణ కేటాయిస్తారా... గత ఏడాది లాగే ఓఏఎంబీసీ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తారా.. అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఆలస్యమైతే అడ్మిషన్లపై ప్రభావం

అటానమస్ హోదా పొందిన టీటీడీ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల నోటిఫికేషన్ త్వరితగతిన విడుదల చేస్తే కనీసం 90 శాతం సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది. గత ఏడాది పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో 80శాతం వరకు అడ్మిషన్లు జరగ్గా, మిగిలిన ఎస్వీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లో 60 శాతానికి మించలేదు. కొన్ని కోర్సుల్లో ప్రవేశాలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. ఇప్పటికే జిల్లాలోని ప్రైవేటు కళాశాలలు అన్ని కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు సమాచారం.

ఎస్వీయూ సిగలో మరో ఆభరణం



ప్రాజెక్ట్ బృందాన్ని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్–పార్ట్నర్‌షిప్స్ ఫర్ ఆక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నేతృత్వంలోని స్పోక్ సంస్థగా ఎస్వీయూ ఎంపికైంది. అంతర్జాతీయస్థాయి పరిశోధనలకు బాటలు వేసే అవకాశాన్ని శ్రీ వేంకటేశ్వర వర్సిటీ అందిపుచ్చుకుంది. వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఏఎన్ఆర్ఎఫ్–పీఏఐఆర్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థల మధ్య పరస్పర సహకార పరిశోధనను ప్రోత్సహించేందుకు హబ్‌అండ్‌స్పోక్ మోడల్‌ను అమల్లోకి తెచ్చిందన్నారు. దేశంలోని 30 ప్రఖ్యాత సంస్థలు ఈ గ్రాంట్‌కు దరఖాస్తు చేయగా వాటిలో ఏడు ప్రధాన హబ్ సంస్థలు ఎంపికయ్యాయని తెలిపారు. అందులో ఎస్వీయూకు స్థానం లభించడం గర్వంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మధుమేహం, ఫ్యాటీ లివర్ వ్యాధి, డెంగీ, మలేరియా, బ్రెస్ట్, బ్లడ్ కాన్సర్ వంటి ప్రధాన ఆరోగ్య సమస్యల పరిష్కారానికి వర్సిటీ పరిశోధనలు చేస్తుందని అన్నారు. ఈసందర్భంగా ప్రాజెక్ట్ బృందానికి వీసీ, రిజిస్ట్రార్ భూపతినాయుడు అభినందనలు తెలిపారు.

ఆదర్శ పంచాయతీని సందర్శించిన పంచాయతీరాజ్ కమిషనర్



చెర్లోపల్లిలో షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కృష్ణతేజ

తిరుపతి రూరల్: చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిణి ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదర్శ పంచాయతీ అవార్డును దక్కించుకోవడంతో ఆ పంచాయతీని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ గురువారం సందర్శించారు. చెర్లోపల్లి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయనకు సర్పంచ్ సుభాషిణి సాదర స్వాగతం పలికారు. అనంతరం గ్రా మ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సేవల గురించి ఫొటోలు ఆధారంగా ఆయనకు వివరించారు. అనంతరం పంచాయతీ శాశ్వత ఆదాయానికి తీసుకున్న నిర్ణయాలు, పూర్తి చేసిన పనుల గురించి తెలుసుకున్న ఆయన సర్పంచ్‌ను అభినందించారు. అలాగే పంచాయతీ కార్యాలయంతో పాటు అక్కడ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులను మిగతా పంచాయతీల వారికి చూపించి ఆదర్శంగా తీసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుశీలాదేవి, డీఎల్‌పీఓ సురేష్ నాయుడు, ఎంపీడీఓలు రామచంద్ర, రమేష్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శశికాంత్‌పై విచారణకు ఆదేశం

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ శశికాంత్ పై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డాక్టర్ శశికాంత్ నెల్లూరు మెడికల్ కళాశాలలో పని చేసే క్రమంలో పోస్ట్ మార్టం రిపోర్టును తప్పుగా ఇచ్చారని నాగలక్ష్మి అనే మహిళ 2017లో హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో అప్పట్లో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారం పై మరింత లోతుగా విచారణ జరపాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌ను విచారణ అధికారిగా నియమించింది.

అమ్మా..ఊపిరాడలేదు!

- ఇద్దరు పిల్లలను కారులో పెట్టి తాళం వేసుకుని వెళ్లిన పెదనాన్న
- రక్షించిన తిరుమల ట్రాఫిక్ పోలీసులు
- అభినందించిన ఎస్పీ

తిరుమల : 'అమ్మా.. ఊపిరాడలేదు..!' అన్నట్టు కారులో చిక్కుకుపోయిన ఆ చిన్నారుల ఆర్తనాదాలు అక్కడి వారిని కదిలించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన గురువారం తిరుమలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా, బద్వేలుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి, సుమలత దంపతులకు భాను (7), నీల (4) ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం వెంకటసుబ్బారెడ్డి విదేశాల్లో ఉన్నారు. సుమలత పిల్లలు, వెంకటసుబ్బారెడ్డి అన్న గంగయ్య అతని భార్య, అల్లుడితో కలిసి గురువారం తిరుమలకు బయలుదేరారు. తిరుపతి అలిపిరికి వచ్చిన అనంతరం సుమలత, గంగయ్య సతీమణి కాలినడకన తిరుమలకు బయలుదేరారు. కారులో గంగయ్య, ఇద్దరు పిల్లలు, అల్లుడు తిరుమలకు చేరుకుని కారును స్థానిక వరాహస్వామి అతిథిగృహం–1 పార్కింగ్ ఏరియాలో పార్క్ చేశారు.

కారులో లాక్ అయ్యారు!

ఆ సమయంలో గంగయ్య పిల్లలు ఇద్దరినీ కారులో ఉంచి కారు డోర్లు లాక్ చేసుకుని బయటకు వెళ్లిపోయాడు. కొంతసేపటికి కారులో ఉన్న పిల్లలకు ఊపిరాడక ఏడుస్తున్నట్లు సమీపంలోని ట్యాక్సీ డ్రైవర్లు గుర్తించి తిరుముల ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు సమీపంలోని ట్యాక్సీ డ్రైవర్ల సహాయంతో కారు అద్దాన్ని పగులకొట్టి తాళం ఓపెన్ చేసి కారులో ఉన్న ఇద్దరు చిన్నారులను బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. అనంతరం ట్రాఫిక్ హోంగార్డు జయచంద్ర, పీఎస్‌జీ వెంకటేష్ ఆధ్వర్యంలో చిన్నారులను వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. చిన్నారుల పెదనాన్న గంగయ్యపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు పిల్లలను రక్షించిన పోలీసులకు తల్లి సుమలత ధన్యవాదాలు తెలిపారు. దీనిపై తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్పందించారు. పోలీసుల సమయస్ఫూర్తిని అభినందించారు.

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్



ఐఐటీ డైరెక్టర్ డా.కెఎన్ సత్యనారాయణ, అధ్యాపక బృందంతో 16వ ఆర్థిక సంఘం చైర్మన్

ఏర్పేడు(రేణిగుంట): 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశం ఉందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్, తొలి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డా.అరవింద్ పనగారియా అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని ఆయన గురువారం సందర్శించారు. 'భారతదేశం గ్లోబల్ ఎకానమీలో తదుపరి దశాబ్దం' అనే అంశంపై ఆయన ఐఐటీ హ్యూమానిటీస్ – సోషల్ సైన్సెస్ విభాగం నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఆయనకు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్.సత్యనారాయణ స్వాగతం పలికి 3వ జనరేషన్ ఐఐటీగా తిరుపతి ఐఐటీ ప్రస్థానం గురించి, పదేళ్లలో ఐఐటీ సాధించిన ప్రగతిని గురించి ఆయనకు వివరించారు. 16వ ఆర్థిక సంఘం సభ్యులు, ఢిల్లీలోని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మనోజ్ పాండా, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రొఫెసర్ అరవింద్ పనగరియా మాట్లాడుతూ రెండు దశాబ్దాలలో భారత్ ఎన్నో సంక్షోభాలను అధిగమించి 8–9 శాతం వృద్ధి రేటు సాధించినట్టు వెల్లడించారు. అటల్ సేతు, కొత్త పార్లమెంట్ భవనం వంటి ప్రాజెక్టులు దేశ సామర్థ్యాన్ని చూపిస్తున్నాయని అన్నారు. రాబోయే దశాబ్దంలో భారతదేశంలో 9–10 ట్రిలియన్ ఎకానమీగా మారే అవకాశం ఉందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీలో జరుగుతున్న మార్పులు, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా రూపుదిద్దుకున్న మూడవ తరం ఐఐటీ పురోగతిని వివరించారు. విద్యార్థులలో మూడవ వంతు మంది పీహెచ్‌డీ ప్రోగ్రాములలో ఉన్నారని, అధ్యాపకులు 200 కి పైగా పరిశోధన ప్రాజెక్టులలో పాల్గొంటున్నారని తెలిపారు.

శ్రీసిటీ డైకిన్ ప్లాంట్ సందర్శన



నౌపుమీ టకేనాక, కె.జె.జావా, శ్రీసిటీ ఎండీ చర్చలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నౌపుమీ టకేనాక గురువారం శ్రీసిటీలోని డైకిన్ ఇండియా తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డైకిన్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.జె.జావా ఆయనకు ఆహ్వానం పలికారు. ప్లాంట్ పనితీరుపై సమీక్ష జరిపిన టకేనాక, ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళిక తదితర అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా టకేనాక, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొద్దిసేపు సమావేశమయ్యారు.

మత్తు ఇంజక్షన్ ఇచ్చిన నిందితుడి అరెస్ట్



నిందితుడితో పోలీసులు

కోట: కోట ఎన్‌సీఆర్ నగర్‌లో ఈ నెల 10న సోలా ప్రమీలకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి బంగారు గాజులు అపహరించిన కేసులో నిందితుడు నిజమాల సంపత్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. డయాబెటిక్ వల్ల ఏర్పడిన గాయాలతో బాధపడుతున్న కోట మండలానికి చెందిన సోలా ప్రమీలకు నెల్లూరు అపోలో ఆస్పత్రి డయాగ్నస్టిక్ సెంటర్‌లో పనిచేసే సంపత్‌కుమార్ వైద్యం చేస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన ఆమె ఇంటి వద్దకు వచ్చి చికిత్స చేసిన అనంతరం మత్తు ఇంజెక్షన్ వేశాడని చెప్పారు. ఆమె స్పృహ కోల్పోయిన తర్వాత సుమారు రూ.2.9 లక్షల విలువైన బంగారు గాజులను అపహరించాడని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని ఊనుగుంటపాళెం రోడ్డు వద్ద గురువారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల నుంచి ఇంటికి వెళ్తూ.. – ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతి

దక్కిలి: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తూ ట్రాక్టర్ కింద పడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన సోకా సెంచలనరసయ్య కుమారుడు సోకా పార్థు (12) డీ వడ్డిపల్లి హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. రోజూ లాగే పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ డీ వడ్డిపల్లి నుంచి మాధవయ్యపాళెంకు వెళ్తోంది. పార్థుతో పాటు మరో ముగ్గురు విద్యార్థులు ట్రాక్టర్‌ను డీ వడ్డిపల్లి హైస్కూల్ దగ్గర ఆపి లిఫ్ట్ అడిగారు. అయితే ముగ్గురు విద్యార్థులు ఇంజన్‌లో కూర్చున్నారు. పార్థు ట్రాక్టర్ ట్రక్కులో నిల్చొని వస్తున్నాడు. రోడ్డు మలుపుల వద్ద తిరగడంతో పార్థు ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తుతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ శివశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియన్ హ్యూమన్ రైట్స్ నూతన కమిటీ



నియామక పత్రాలు అందుకుంటున్న నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటి కరప్షన సెల్ రాష్ట్ర, జిల్లా, నగర నూతన కమిటీ ప్రతినిధులను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి తెలిపారు. గురువారం సంస్థ కార్యాలయంలో కమిటీ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.హరిబాబు, జిల్లా అధ్యక్షుడుగా ఆవుల మునిరెడ్డి, తిరుపతి నగర కమిటీ అధ్యక్షుడుగా ఎస్.దేవిశ్రీ ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా భవనశ్రీ రమేష్‌ని ఎంపిక చేసినట్టు తెలిపారు.

పేదలపై ఎందుకింత కక్ష

- భూములకు పరిహారం అడిగితే బెదిరింపులా?
- బాధితులను అడ్డుకున్న పోలీసులు
- పంతం నెగ్గించుకున్న అధికారులు



గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు, అధికారులు

చిల్లకూరు: 'పేదలపై ఎందుకింత కక్ష. మేము ఆ భూములనే నమ్ముకని జీవిస్తున్నాము. తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు భూములు లాక్కుని పరిహారం ఇవ్వమంటే ఇలా నిర్బంధించడం మంచిదేనా.. మా భూములు లాక్కుని మాకిచ్చే గౌరవం ఇదేనా?' అంటూ తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్ సిటీ అభివృద్ధి పనుల కోసం వచ్చిన యంత్రాలను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. పరిహారం ఇచ్చేవరకు కదలనివ్వమని భీష్మించుకున్నారు.

పరిహారం ఎందుకివ్వరు?

తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సుమారు 980 ఎకరాల భూములను క్రిస్ సిటీ కోసం ఏపీఐఐసీ ద్వారా సేకరించారు. ఇందులో సాగులో ఉన్న భూములకు త ప్ప బీడుగా ఉన్న సుమారు 297 ఎకరాలను పరిహా రం జాబితాలో చేర్చకుండా వదిలేశారు. దీంతో తమ్మినపట్నం, లింగవరం, తీగపాళెం, మన్నేగుంట పల్లెవానిదిబ్బ గ్రామాల రైతులు నిరసనలు చేపట్టారు.

అడ్డుకుంటూ..అరెస్ట్‌లు చేస్తూ

బీడు భూములకు పరిహారం రాకుండా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, తహసీల్దార్ శ్రీనివాసులు అడ్డుకుంటున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపించారు. ఆపై పోలీసులు రంగప్రవేశం చేసి గ్రామస్తులను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. ఆపై కొంత మందిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. పరిహారం అడిగితే ఎందుకంత కక్ష్య అంటూ గ్రామస్తులు మండిపడ్డారు.

పొట్టకొట్టొద్దు



గ్రామానికి సమపంలో ఉన్న భూముల్లో జీడిమామిడి, చీపురు పుల్లలు, నేరేడు, తాటి చెట్లు, ఇతర మొక్కలు ఉండేవి. వాటి నుంచి వచ్చే ఫల సాయాన్ని గ్రామంలోని వారంతా సేకరించుకుని వాటిని విక్రయించుకుని దాని ద్వారా వచ్చిన ఆదాయంతో పొట్ట పోసుకునే వారు. నేడు ఆ భూములను క్రిస్ సిటీకి సేకరించే సమయంలో కనీస పరిహారం అయినా ఇచ్చి ఆదుకోవాలి.

– రమణయ్య, మాజీ సర్పంచ్, తమ్మినపట్నం

తాతల కాలం నుంచి అనుభవంలో



తమ్మినపట్నం గ్రామానికి సమీపంలో ఉన్న భూముల్లో తాతల కాలం నుంచి భూములు అనుభవించుకుంటున్నాం. అధికారులు నేడు బీడు భూమి అని చెప్పే భూముల్లో ఎలాంటి సాగు ఉండేదనే విషయాలను గతంలో ఇక్కడ పనిచేసిన అటవీ అధికారులను అడిగితే తెలుస్తుంది. శాటిలైట్ సర్వే అంటున్నారు. మేము తీసిన శాటిలైట్ ఫొటోలలో సాగు కనిపిస్తుంది. దీనిని ఎందుకు ప్రమాణికంగా తీసుకోవడం లేదో తెలియడం లేదు. ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలి.

– వెంకటేశ్వర్లు, తమ్మినపట్నం